సాక్షి
రంగారెడ్డి
శనివారం । 5 । ఆగస్టు । 2023



అనుమానాస్పదస్థితిలో ..

అనుమానాస్పదస్థితిలో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మహేశ్వరంలో చోటుచేసుకుంది. 8లో▸



పర్యావరణానికి ముప్పు!

జల్‌పల్లి మున్సిపాలిటీని పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. గుట్టపై గుట్టలుగా చెత్త పేరుకుపోయింది. 8లో▸



ఆటో, టిప్పర్ ఢీకొని మృతి

టిప్పర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన ఆదిబట్ల పరిధిలో జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాలకు భవనాలు మంజూరు చేయాలి



మహేందర్‌కు నియామకపత్రం అందిస్తున్న రాపోలు నర్సింలు

చేవెళ్ల: గురుకుల పాఠశాలలకు వెంటనే సొంత భవనాలు మంజూరు చేయాలని తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం సంఘం జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని రామన్నగూడకు చెందిన మహేందర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తెలంగాణ ప్రజా చైతన్య సమితి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాపోలు నర్సింలు, ఇతర నాయకులకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీపతి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కురుమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కుమార్, కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగిలించలేనిది విద్య ఒక్కటే



ఉచిత బస్‌పాస్‌లు అందించిన తర్వాత విద్యార్థులతో చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: ప్రపంచంలో దొంగిలించలేనిది విద్య ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులకు శుక్రవారం ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ఆర్థిక పరిస్థితినే మార్చివేస్తుందని, సమాజంలో కీర్తి ప్రతిష్టలు, గౌరవం తెస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బస్‌పాస్‌లు అందించడంలో సహకరించిన డిపో మేనేజర్ మనోహర్‌రెడ్డి, హెచ్‌ఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, వైస్ ఎంపీపీ జి.శమంత, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

మహేశ్వరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌కి చెందిన 150 మంది విద్యార్థులకు శుక్రవారం బస్‌పాసులు అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి 100 పడకలకు అప్‌గ్రేడ్

చేవెళ్ల: మండలకేంద్రంలోని ఏరియా ఆస్పత్రి 50 పడకల నుంచి 100 పడకలుగా అప్‌గ్రేడ్ అయిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ఇందులో భాగంగా చేవెళ్ల ఏరియా ఆస్పత్రిని 50 నుంచి 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు వైద్య పరికరాల కోసం రూ.17.50 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ విడుదలైనట్లు తెలిపారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్‌స్థాయిలో మెరుగైన వైద్యసేవలు మరింతగా అందనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వగా మారుస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

బంగారం ద్రవాన్ని చీరపై స్ప్రేగా చల్లి అక్రమ రవాణా

శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి దుబాయ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి లగేజీని పరిశీలించారు. అందులో ఉన్న ఓ కాటన్ చీరపై బంగారం ద్రవాన్ని స్ప్రేగా చల్లి తీసుకొచ్చినట్లు గుర్తించి దానిని బయటికి తీశారు. బయటపడిన 461 గ్రాముల బంగారం విలువ రూ.28 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వానలోనూ మంటలే..!

శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో 515 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గత నెల 21న అర్ధరాత్రి అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. భారీ వర్షానికి తోడు అప్పటికే విద్యార్థునులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా మంటలు రావడంతో బయటికి పరుగులు తీశారు. ఆ రోజంతా వారికి సమీపంలోని పోలీసు స్టేషన్‌లోనే ఆశ్రయం కల్పించాల్సి వచ్చింది.

రాజేంద్రనగర్ పరిధిలోని హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఇబ్రహీం పాత దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. ఎప్పటి మాదిరే మంగళవారం రాత్రి గోదాం ప్రధాన గేటుకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం తెల్లవారు జామున గోదాంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్పటికే నిల్వ చేసిన దుస్తులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగింది.



ఇటీవల హసన్‌నగర్‌లో జరిగిన ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వర్షాకాలంలోనూ అగ్ని ప్రమాదాలు

- పాత, నాసిరకం కేబుళ్లతోనే ప్రమాదాలు
- విలువైన ఆస్తి బుగ్గిపాలు
- గృహ వినియోగదారులు, వ్యాపారులకు తీవ్ర నష్టం
- మానవతప్పిదాలతోనే అంటున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వేసవితో పోలిస్తే ప్రస్తుతం గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగం తక్కువే. ప్రస్తుతం ఆయా సముదాయాల్లోని ఏసీలన్నీ దాదాపు స్విచ్చాఫ్ చేసి ఉంటాయి. సర్వీసు వైరు సహా అంతర్గత విద్యుత్ కేబుళ్లపై పెద్దగా భారం కూడా ఉండదు. అయినా షార్ట్‌సర్క్యూట్‌లు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో కొన్ని ప్రమాదాలు వెలుగు చూస్తుండగా..మానవ తప్పిదాలతో మరికొన్ని ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఫలితంగా విలువైన ఆస్తి బుగ్గిపాలవుతూ.. గృహ వినియోగదారులతో పాటు వ్యాపారులు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. రాజేంద్రనగర్, శంషాబాద్, అత్తాపూర్, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, తుర్క యంజాల్, తుక్కుగూడ, ఎల్బీనగర్, తదితర ప్రాంతాల్లో ఫర్నిచర్, వస్త్ర, ప్లాస్టిక్ గోదాములు భారీగా వెలిశాయి. నిర్వాహకులకు విద్యుత్‌పై సరైన అవగాహన లేకపోవడంతో తక్కువ సామర్థ్యం ఉన్న నాసిరకం వైర్లు వాడుతున్నారు. వాటికి అనేక జాయింట్లు ఉండటం , వర్షపు నీరు వాటిమధ్యలోకి చేరి షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ తలెత్తిన వెంటనే విద్యుత్ సరఫరా నియంత్రించే పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది.

మెజార్టీ ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే..

జిల్లాలో వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. మెజార్టీ సంస్థలు బహుళ అంతస్తుల భవనాల్లోనే ఏర్పాటవుతున్నాయి. భవన యజమానులు నిర్మాణ పనులను బిల్డర్లకు అప్పగిస్తున్నారు. వీరు నిర్మాణ సమయంలో ఖర్చు తగ్గించుకుని, ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందాలని భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా తాత్కాలికంగా మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం సర్వీసువైర్లు, కేబుళ్లు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. భవన యజమానులకు ఈ విద్యుత్ సరఫరా వ్యవస్థపై పెద్దగా అవగాహన లేకపోవడం కూడా వీరికి కలిసి వస్తోంది. తీరా నిర్మాణాలు పూర్తయి.. భవనం వినియోగంలోకి వచ్చిన తర్వాత వాటిని కొనుగోలు చేసిన వారు, అద్దెకు దిగిన వారు వైర్ల సామర్థ్యానికి మించి విద్యుత్ వాడుతున్నారు. ఏసీ, రిఫ్రిజిరేటర్, గ్రీజర్, కంప్యూటర్, ఓవెన్ సహా ఇతర గృహోపకరణాలన్నీ వినియోగిస్తున్నారు. ఇందుకు మల్టీపుల్ సాకెట్లను వినియోగిస్తున్నారు. సర్వీసు వైరు సహా ఇతర కేబుళ్ల సామర్థ్యానికి మించి విద్యుత్ లోడును వినియోగిస్తుండటంతో గోడల లోపల ఉన్న విద్యుత్ వైర్లు హీటెక్కిపోతున్నాయి. జాయింట్ల వద్ద స్పార్క్‌లు తలెత్తుతున్నాయి. స్పార్కులతో ఎగిసిపడిన అగ్నికీలలు పక్కనే ఉన్న సున్నితమైన వస్తువులపై పడి సులభంగా మంటలు వ్యాపిస్తున్నాయి. ఏకధాటి వర్షాలకు పాత గోడలు జాలువారి వర్షపు నీరు ఆ జాయింట్ల మధ్యకు చేరి షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతోంది. భగవంతుడి కోసం వెలిగించిన దీపాలు కూడా ప్రమాదాలకు మరో కారణంగా భావిస్తున్నారు. కొంతమంది దుకాణాలు మూసే సమయంలో దేవుడి ఫొటోల ముందు దీపాలు వెలిగిస్తుంటారు. దీపపు కుందుల్లోని నూనె పూర్తిగా కాలిపోయిన తర్వాత అందులోని ఒత్తులు కిందపడి అగ్నిప్రమాదాలకు కారణమవుతోంది. ఈ మానవ తప్పిదాలను కూడా షార్ట్‌సర్క్యూట్‌ల జాబితాలో చేర్చుతున్నారు.

ఆర్‌సీసీబీలు ఏర్పాటు చేసుకోవాలి



భవిష్యత్తు అవసరాలు గుర్తించి ఈ మేరకు సర్వీసు (6 స్క్వైర్ ఎంఎం) వైరుతో పాటు అంతర్గత కేబుళ్ల (4 స్క్వైర్ ఎంఎం వైర్లు), ఐఎస్ఓ ప్రమాణాల మేరకు తయారు చేసిన నాణ్యమైన స్విచ్‌బోర్డులు, సాకెట్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ లైసెన్సు పొందిన కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలి. ప్రమాదవశాత్తు తలెత్తే షార్ట్ సర్క్యూట్‌ను నియంత్రించేందుకు అవసరమైన రిసిడ్యూయల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్ (ఆర్‌సీసీబీ) ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి పదిహేనేళ్లకు ఒకసారి విద్యుత్ వైర్లను మార్చుకోవాలి. జాయింట్లను సరి చేసుకోవాలి. మల్టీపుల్ సాకెట్లు వినియోగించకుండా చూసుకోవడం ద్వారా ప్రమాదాలను నియంత్రించొచ్చు.

– టి.కాంతారావు, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

‘ధరణి’ పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల విషయంలో జాప్యం వహించకుండా, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ హరీశ్ తహసీల్దార్లకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్డీఓలు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన తహసీల్దార్లంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులతో పాటు ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సక్సెషన్ దరఖాస్తులు, పెండింగ్ మ్యూటేషన్లకు సంబంధించి వంద శాతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తరువాతే పరిష్కరించాలని ఆదేశించారు. మీ–సేవకు సంబంధించిన జనన, మరణ, కులధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేయాలన్నారు. డబల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తులు, కల్యాణ లక్ష్మి/షాదీముబారక్ దరఖాస్తులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని కోరారు. ఎన్నికల అంశానికి సంబంధించి బీఎల్ఓ లాగిన్‌పై దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటర్ జాబితాలో ఇంకా పరిశీలించని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈఆర్‌ఓలు సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అర్హులైన ఓటర్లందరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారంతా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటు నమోదు, మార్పులు చేర్పులు చేసే విధంగా ఫామ్ 6,7,8లను వెంటనే పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాన్ని పూర్తి చేయండి

- లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

ఆమనగల్లు: వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రుణాలను గ్రౌండింగ్ చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. రైతుబంధు ఖాతాల్లో ప్రభుత్వం వేస్తున్న నిధులను బ్యాంకర్లు రైతులకు ఇవ్వకుండా ఆపొద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్‌కార్యాలయం సమావేశపు హాలులో శుక్రవారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల సంయుక్త బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వయం సహాయక గ్రూపులకు అందిస్తున్న రుణాలు, రికవరీల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు ఫారూఖ్ హుస్సేన్, రాఘవులు, రామకృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు



మొక్క నాటుతున్న లక్ష్మీనివాస్, తదితరులు

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

- టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రతం ఎడ్యుకేషనల్ కళాశాలలో శుక్రవారం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థుల్లో ఉంటుందని అన్నారు. యువతీ యువకులు సామాజిక స్పృహను అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని.. జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని విద్యార్థులు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర క్యాదర్శి అనిల్‌యాదవ్, ప్రిన్సిపాల్ హనుమంతు, కమిటీ సభ్యుడు మహేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ చౌహాన్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్న ఐదుగురు ముఠా సభ్యుల గుట్టును పోలీసులు రట్టు చేశారు. వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ శుక్రవారం వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన పెరుమాళ్ల రజనీకాంత్ (22) డ్రగ్స్‌కు బానిసై పలు నేరాలకు పాల్పడ్డాడు. ఇతనికి సోషల్ నెట్‌వర్కింగ్ నిర్వహించే మాదాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ సమీర్‌తో పరిచయం ఏర్పడింది. జల్సాలకు అలవాటు పడిన వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో కాలేజీ, స్కూల్ విద్యార్థులకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ప్రణాళిక అమలు చేయడానికి వనస్థలిపురంలోని రైతుబజారు వద్ద ఓ కానిస్టేబుల్ పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతానికి వెళ్లి ఐదు కిలోల గంజాయి తీసుకువస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం పోలీసులు సంయుక్తంగా మాటు వేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని వివిధ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న ఉట్కూరి సాత్వికరెడ్డి, తోడేటి వంశీ, గాడిపల్లి హేమంత్ కొనుగోలు చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారని చెప్పడంతో వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు కిలోల గంజాయి, ఓ ద్విచక్ర వాహనం,నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.పరారీలో ఉన్న ఒడిశాలోని మరో నిందితుడు తిరుపతి కోసం గాలిస్తున్నారు.

పిల్లల కార్యకలాపాలపై నిఘా పెట్టాలి

ఇటీవలి కాలంలో అనేక మంది యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయని.. ఇలాంటి వాటిని అరికట్టి డ్రగ్స్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంతో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీ చౌహాన్ పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. సంఘవిద్రోహ చర్యలను అరికట్టేందుకు యువత సంకోచించకుండా పోలీసులను ఆశ్రయించాలని విజ్ఞప్తి చేశారు.

అధిక వడ్డీ ఆశ చూపి
రూ.2 కోట్లతో మహిళ పరార్



అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చంద్రకళపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

మైలార్‌దేవ్‌పల్లి: అధికవడ్డీ ఆశచూపి దాదాపు రూ.2 కోట్ల వరకు వసూలు చేసుకొని పరారైన మహిళలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే...అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా చంద్రకళ అనే మహిళ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. మాయమాటలు చెబుతూ ఆమె ఇరుగుపొరుగు మహిళల నుంచి వడ్డీకని చెప్పి దాదాపు రూ.2 కోట్ల వరకు తీసుకుంది. రూ.3 నుంచి 5 రూపాయల వరకు వడ్డీ ఇస్తానని చెప్పి.. ఒకరికి తెలియకుండా మరొకరికి బురిడీ వేసింది. కొందరి దగ్గర నగదు, మరికొందరి వద్ద బంగారం తీసుకున్నది. మే నెలలో ఇస్తానని చెప్పి కనిపించకుండా పోవడంతో శుక్రవారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నందుకు..

రాజేంద్రనగర్: సెల్‌ఫోన్ అధికంగా మాట్లాడుతున్న కూతుర్ని తల్లిదండ్రులు మందలించి సెల్‌ఫోన్‌ను తీసుకొని స్విచ్చాఫ్ చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక గదిలోకి వెళ్లి ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చే సుకుంది. పోలీసుల కథనం ప్రకారం కింగ్స్ కా లనీకి చెందిన ఓ బాలిక (15) 8వ తరగతి చదు వుతోంది. శుక్రవారం ఉదయం సెల్‌ఫోన్‌లో మా ట్లాడుతుండడం చేసి తల్లిదండ్రులు మందలించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లోని మరో గదిలోకి వెళ్లింది. తమ పనిలో నిమగ్నమైన తల్లిదండ్రులు మధ్యాహ్నమైనా కూతురు గదిలోంచి బయటకు రాకపోవడంతో వెళ్లి చూడగా ఉరి వేసుకొని ఉంది. ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘పల్లె ప్రగతి’ పనులు భేష్



నందుపల్లిలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మహేశ్వరం: మండల పరిధిలోని నందుపల్లి పంచాయతీలోని పల్లె ప్రకృతివనం, పంచాయతీ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం సందర్శించారు. గ్రామంలో ఉన్న నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డు, ట్రాక్టర్, ట్యాంకర్‌తో పాటు నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. పంచాయతీ రికార్డులు, ఇప్పటి వరకు విడుదలైన నిధులు, జరిగిన పనులపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శుల రెగ్యులర్ అంశం గురించి పంచాయతీ కార్యదర్శుల వివరాలు, వారి పనితనం గురించి ఎంపీడీఓ, ఎంపీఓలను అడిగి తెలుసుకున్నారు. గ్రా మంలో అభివృద్ధి, పల్లె ప్రగతి పనులపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీఎల్‌పీఓ అమృత, ఎంపీడీఓ నర్సింహ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ దేశపాగ కళావతి ఉన్నారు.

ఆటో, టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

మరో ముగ్గురికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం: టిప్పర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగులూర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 12 సరీ్వస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న టిప్పర్, ఆటోలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సూర్యాపేటకు చెందిన ప్రకాశ్(20) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. లేబర్ పనిపై ఆదిభట్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆటోలోని ప్రయాణికులు హయత్‌నగర్, కొత్తపేట ప్రాంతాల్లో నివాసముంటున్నట్లు సమాచారం. స్థానిక ఏసీపీ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సివుంది. కేసు దర్యాప్తులో ఉంది.


ప్రమాదానికి కారణమైన ఆటో, టిప్పర్

అనుమానాస్పదస్థితిలో బాలిక ఆత్మహత్య

- ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా శిక్షణ
- అక్కడి విశ్రాంతి గదిలో బలవన్మరణం
- న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబసభ్యుల ధర్నా
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ


తేజస్విని(ఫైల్)

మహేశ్వరం: అనుమానాస్పదస్థితిలో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని మమత ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన కృష్ణ కుమార్తె తేజస్విని(17) ఇంటర్ పూర్తి చేసి మమత హాస్పిటల్‌లో మూడు నెలల నుంచి నర్సుగా శిక్షణ తీసుకుంటోంది. ఉదయం ఆస్పత్రికి వచ్చిన తేజస్విని, మధ్యాహ్నం భోజనం చేసేందుకు విశ్రాంతి గదికి వెళ్లింది. రెండు గంటలైనా రాకపోవడంతో తోటి సిబ్బంది విశ్రాంతి గది వద్దకు వెళ్లారు. తలుపులు తెరిచి చూడగా తేజస్విని ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించింది. వెంటనే డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

న్యాయం చేయాలంటూ ధర్నా

తేజస్విని ఆత్మహత్యకు గల కారణాలను గుర్తించి న్యాయం చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద 4 గంటల పాటు రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు క్లియర్ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ బిడ్డ అమాయకురాలని, ఎవరో పొట్టన బెట్టుకున్నారని బోరున విలపించారు. తేజస్విని మృతికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. మమత హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. మహేశ్వరం, కందుకూరు సీఐలు మురళి, విష్ణువర్ధన్‌రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడారు. తేజస్విని మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మమత హాస్పిటల్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైతాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలోని కటేరా కంపెనీ ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ స్థలంలో విద్యుత్ పోల్ కోసం తీసిన గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతని వయస్సు సుమారు నలభై సంవత్సరాలు ఉండవచ్చు. మృతుడు గోధుమ రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంట్, ఆఫ్ బనియన్, ఎరుపు, నలుపు రంగు షార్ట్, మెడలో పూసలమాల, నలుపు రంగు మొలతాడు, ఎడమ చేతి మణికట్టు వద్ద కాలిన గుర్తులు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: జంట నగరాలలోని 179 మద్యం దుకాణాల నిర్వహణకు 2023–25 సంవత్సరాలకు గాను ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ నగర డిప్యూటీ కమిషనర్ కె.శాస్త్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లిలోని అబ్కారిశాఖ కార్యాలయంలో మద్యం దుకాణాలకు టెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 18వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, ఈ నెల 21వ తేదీన అంబర్‌పేటలోని మహారాజా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల డ్రాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లలో భాగంగా 24 దుకాణాలను కేటాయించినట్లు వెల్లడించారు. గతంలో 1786 దరఖాస్తులు రాగా ఈ సారి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

యువతి అదృశ్యం

యాచారం: బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి.. ఓ యువతి అదృశ్యమైంది. ఇందుకు సంబంధించి యాచారం పోలీసుల తెలిపిన వివరాలు.. యాచారం గ్రామానికి చెందిన (19) ఓ యువతి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో.. బంధువులకు ఫోన్ చేయగా అక్కడకు సైతం చేరుకోలేదని తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు శుక్రవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మల్లారెడ్డిపై విమర్శలు తగదు

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చేసిన విమర్శలు అర్థరహితమని మేడ్చల్ మండల బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మేడ్చల్ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి మల్లారెడ్డిని కెఎల్‌ఆర్ తన రాజకీయం మనుగడ కోసం విమర్శించడం తగదన్నారు. కెఎల్‌ఆర్ ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి రియల్ వ్యాపారాలు చేసుకుని కోట్లు దండుకున్నాడని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సమావేశంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

25న పంజగుట్ట హిందూ శ్మశాన వాటిక ప్రారంభం


ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో చర్చిస్తున్న మంత్రి

బంజారాహిల్స్: మనిషి చివరి మజిలీ ప్రశాంతంగా ముగియాలనే ఆలోచనతో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.3లో రూ.5 కోట్ల వ్యయంతో జరుగుతున్న పంజగుట్ట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. శ్మశాన వాటికను ఈ నెల 25న ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. చక్కని రోడ్లు, ప్రహరీ నిర్మాణం, అస్థికలను భద్రపరిచేలా లాకర్ల ఏర్పాటు తదితర సౌకర్యాలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇది 12 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటోందని చెప్పారు. నగరంలో ఇప్పటికే చాలా శ్మశాన వాటికలను అభివృద్ధి చేశామన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి రూ.1.95 కోట్లు, రూ.3 కోట్లు ఫినిక్స్ నుంచి వెచ్చించి పంజగుట్ట శ్మశాన వాటిక సుందరంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, ఎస్ఈ రత్నాకర్, డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు!


డంపింగ్ యార్డుకు మంటలు అంటుకోవడంతో దట్టంగా కమ్ముకున్న పొగలు

- డంపింగ్ యార్డులో ఎగిసిన పడిన మంటలు, పొగ
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యకు ఈ చిత్రం పరాకాష్టగా నిలుస్తోంది. 28 వార్డుల నుంచి సేకరించిన చెత్తలో 70 శాతానికి పైగా.. ఇన్నాళ్ల పాటు కార్గో రోడ్డు పక్కన ఉన్న బిజాన్ గుట్టపై డంప్ చేస్తున్నారు. గుట్టలుగా పేరుకుపోయిన ఈ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీకి తరలిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం డంపింగ్ యార్డుకు మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున పొగ కమ్ముకుంది. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆందోళన చెందారు. చెత్తకు మున్సిపల్ సిబ్బంది నిప్పు పెట్టారా..? లేదా చెత్తలోని ఇతర వస్తువులు సేకరించేందుకు వచ్చిన వారు ఎవరైనా ఇలా చేశారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా అటు స్వచ్ఛమైన చెరువును కలుషితం చేయడంతో పాటు ఇటు పర్యావరణానికి ముప్పు కలిగించే ఇలాంటి ఘటనలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం


యాదగిరి(ఫైల్)

నందిగామ: ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన నందిగామ శివారులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నందిగామ ఎస్‌ఐ గోపాలకృష్ణ కథనం మేరకు.. చంద్రాయన్ గూడ గ్రామానికి చెందిన యాదగిరి(48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై శంషాబాద్ సమీపంలోని ఊట్‌పల్లిలో ఉంటున్న కూతురి ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి అక్కడికక్కడే చనిపోయాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం తెలిసింది. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర కోరారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఐటీ కంపెనీలు, ఐటీ సంస్థలతో ఎస్‌సీఎస్‌సీ, సైబరాబాద్ పోలీసులతో ఆయన ఇంటరాక్టివ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ సంస్థల ఉద్యోగులు ఇళ్ల నుంచి కార్యాలయానికి, అక్కడి నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో రోడ్లపై రాకపోకల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. కార్ పూలింగ్‌పై ఐటీ ఉద్యోగులు దృష్టి పెట్టేలా సంస్థలన్నీ దృష్టి సారించాలని ఆయన సూచించారు. మంగళవారం నుంచి గురువారం దాకా రోడ్లపై ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. ఈ సమయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చేయడంపై సమర్థవంతమైన చర్యలు పోలీసులు తీసుకోవడంలో అందరూ సహకరించాలన్నారు. ఉద్యోగులు కార్యాలయంలో 60 శాతం సమయం, మిగిలిన సమయం ఇంట్లో లాగ్‌ఇన్ చేయడం కొనసాగించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్, టీసీఎస్, హెచ్‌ఎస్‌బీసీ, జేపీమోర్గాన్ పాల్గొన్నారు.